క్లుప్తంగా

అమ్మవారి సేవలో రాష్ట్ర మంత్రి



అమ్మవారిని దర్శించుకున్న ఉషాశ్రీచరణ్

తిరుచానూరు (చంద్రగిరి): శ్రీపద్మావతి అమ్మవారిని రాష్ట్ర మంత్రి ఉషాశ్రీచరణ్ గురువారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

టీటీడీ ఎంప్లాయిస్ డైరీ ఆవిష్కరణ



టీటీడీ ఎంప్లాయిస్ డైరీలను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి(అలిపిరి): టీటీడీ పాలకమండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి చేతులు మీదుగా ఆయన స్వగృహం వద్ద టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీని గురువారం ఉదయం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు, ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంకు, టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్, కార్యవర్గ సభ్యులు ఇ.సునీల్ కుమార్, రేఖ, కొప్పర్తి శివ, వంకీపురం పవన్, జల్లా శివ ప్రసాద్, గంట భరత్, ధరణి కుమార్, అశోక్ కుమార్, పెరుమాళ్, విశ్వనాథం, చిన్ని, ప్రియ వర్ధన్ బాబు, యుగంధర్ రెడ్డి, అంకయ్య, రవి కుమార్ రెడ్డి, ఈశ్వర్ నాయక్, రవి కుమార్, ఈశ్వర్, మస్తాన్ రావు, ఉమా, హర్ష, నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు



హుండీలోని నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

పాకాల: ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ఆలయంలో భక్తులు 2023 అక్టోబర్ 17వ తేదీ నుంచి 2024 జనవరి 4వ తేదీ వరకు సమర్పించిన కానుకలను లెక్కించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి పేర్కొన్నారు. ఆలయానికి హుండీ ద్వారా రూ.2,29,569 ఆదాయం వచ్చిందని వివరించారు. ఆలయ ఈఓ ఎస్.యువరాణి, దేవదాయశాఖ తనిఖీదారు ఫణిరాజశయన, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, పోలీసులు పాల్గొన్నారు.

యూత్ గ్రూపుల ఏర్పాటుపై అవగాహన

భాకరాపేట: సెట్విన్ ఆధ్వర్యంలో యూత్ గ్రూప్‌లు ఏర్పాటు చేయడం ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు గురించి ఎప్పటికప్పుడు తెలుస్తుందని తిరుపతి సెట్విన్ అధికారి బీసీ నాయక్ పేర్కొన్నారు. గురువారం చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో దేవేంద్ర బాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యూత్ గ్రూపులు ఏర్పాటు చేయడం ద్వారా సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలు ఎప్పటికప్పుడు తెలియజేస్తామన్నారు. వెంటనే గ్రూపులు ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యార్థులకు ఆట వస్తువులు పంపిణీ



ఆట వస్తువులను అందజేస్తున్న పాఠశాల కమిటీ

పాకాల: రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన ఆట వస్తువులను చిన్నగోర్పాడు ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎం ఎం.ప్రభు, పాఠశాల కమిటీ సభ్యులు దుర్గం బాలాజీ, అర్చన, వార్డు మెంబర్లు, వలంటీర్ అనిత పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా.. బ్యాడ్మింటన్ విజేత యతీశ్వర్‌రెడ్డి

తిరుపతి రూరల్: ఆడుదాం ఆంధ్రా పోటీ ల్లో భాగంగా పెరుమాళ్లపల్లి సచివాలయం పరిధిలో గురువారం బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా జరిగిన పోటీల్లో పురుషుల విభాగంలో యతీశ్వర్‌రెడ్డి, పార్థివ్‌రెడ్డి విజేతలుగా నిలిచారు. వారికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొత్తపాటి మునీశ్వర్‌రెడ్డి, సర్పంచ్ జోగి మోహన్, బొందు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

99శాతం హామీలు నెరవేర్చిన ఘనత జగనన్నదే..

- 40ఏళ్లల్లో చేయలేని అభివృద్ధి నాలుగేళ్లలో చేసి చూపాం
- స్వర్గధామంగా తిరుపతి మాస్టర్‌ప్లాన్ రోడ్లు
- రూ.3 వేల పెన్షన్ పంపిణీలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



జగనన్నకు మద్దతుగా ఉంటామంటూ చేతులెత్తి మద్దతు తెలుపుతున్న లబ్ధిదారులు

తిరుపతి మంగళం: దేశ రాజకీయ చరిత్రలో ఇంతవరకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చిన నాయకుడే లేరని, ఇచ్చిన మాటకు కట్టుబడి హామీల్లో 99శాతం నెరవేర్చిన మొనగాడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. నగరంలోని పోస్టల్‌కాలనీ వద్ద గురువారం జగనన్న అందించిన రూ.3వేల పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఓ పండుగలా నిర్వహించారు. అర్హులైన అవ్వా, తాతలు, వితంతువులకు ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేషన్ కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్, 2024 వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి అందించారు. ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ కరోనా వంటి కష్టకాలంలో కూడా సంక్షేమ పథకాలను అందించిన గొప్ప నాయకుడు జగనన్న అని కొనియాడారు. అనంతరం మేయర్ శిరీష మాట్లాడుతూ ప్రతి అవ్వా, తాత ఎంతో సంతోషంగా రూ. 3వేలు పెన్షన్ తీసుకుంటున్నారంటే అది జగనన్న పుణ్యమేనన్నారు.

అభివృద్ధి నాలుగేళ్లలో చేసి చూపాం...

40ఏళ్లలో ఏ ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధి కేవలం నాలుగన్నరేళ్ల వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేసి చూపామని తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, 2024 వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఎవ్వరికీ సాధ్యం కాని విధంగా అభివృద్ధి చేసిన తర్వాతే ఓట్లు అడుగుతున్నామన్నారు. దేశానికే ఆదర్శంగా తిరుపతి నగరాన్ని రూ. 1700కోట్లతో అభివృద్ధి చేశామంటే అది కేవలం జగనన్న సహకారం వల్లేనన్నారు. 22ఎ రద్దుతో సుమారు 7 వేల మందికి రిజిస్ట్రేషన్ల సౌకర్యం కల్పించడం జరిగిందని, 75 ఏళ్ల శెట్టిపల్లి భూసమస్యను పరిష్కరించి వారికి భూ హక్కు కల్పిస్తూ ప్రొసీడింగ్స్‌ను అందించామన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, కేతం జయచంద్రారెడ్డి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పుల్లయ్య, కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కే బాబు, కార్పొరేటర్లు కోటూరు ఆంజనేయులు, దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి, బోకం అనిల్‌కుమార్, శ్రీదేవి, దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, వెంకటేష్‌రాయల్, మద్దాలి శేఖర్, తాలూరి ప్రసాద్, భరణీయాదవ్ పాల్గొన్నారు.

అడుగులో అడుగేస్తూ...

- సుదీర్ఘ పాదయాత్రికుడికి చంద్రగిరిలో ఘనస్వాగతం
- బసవరావును అభినందనలతో ముంచెత్తిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



బసవరావును సత్కరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



ఎస్సీ కమిషన్ సభ్యుడు కట్టిపోగు బసవరావుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

చంద్రగిరి: అభిమాన నాయకుడు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, పార్టీ తరఫున పోటీ చేస్తున్న 175 మంది అభ్యర్థులు రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలవాలని ఆకాంక్షిస్తూ వై నాట్ 175కి మద్దతుగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు కట్టిపోగు బసవరావుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది నవంబర్ 17న ఇడుపుల పాయ నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్రను ప్రారంభించిన బసవరావు 801 కిలోమీటర్లు పూర్తి చేసుకుని గురువారం చంద్రగిరికి చేరుకున్నారు. తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. దుశ్శాలువాతో సత్కరించారు. పూలవర్షం కురిపించారు. చంద్రగిరి నుంచి కాలూరు వరకు బసవరావుతో కలిసి పాదయాత్ర చేస్తూ సంఘీభావం తెలిపారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, మండల కన్వీనర్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేణుగోపాలరెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, బుల్లెట్ చంద్ర, మాధవరెడ్డి, ఔరంగజేబు, సాయి, నాయకులు పాల్గొన్నారు.

మమ్మురంగా జియో ట్యాగింగ్



లబ్ధిదారుల బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి

తిరుపతి తుడా: నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా తిరుపతి నగర పరిధిలో ఇంటి పట్టాలు మంజూరు చేసిన లబ్ధిదారులకు స్టేజ్ జియో ట్యాగింగ్ ప్రత్యేక మేళాను గురువారం మెదలు పెట్టారు. లబ్ధిదారులతో కలిసి ప్లాట్‌ల వద్దకు తీసుకెళ్లి ట్యాగింగ్ ప్రక్రియను చేపట్టారు. ఇందులో భాగంగా జగనన్న కాలనీల వద్దకు తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన బస్సులను తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో దాదాపు 26 వేల మందికిపైగా ఇంటి స్థలాలు పొందారన్నారు. మొదటి దఫా నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి చేసుకుంటున్నాయని చెప్పారు. గృహ నిర్మాణాలను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. చిందేపల్లి, కొత్తపల్లి, కల్లూరు, జి.పాలెం, సూరప్ప కాసం లేఔట్లలో ఇంటి నిర్మాణం పూర్తయిన లబ్ధిదారులకు మెగా ఆపరేషన్ జియో ట్యాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సెక్టోరల్ ఆఫీసర్లు, హౌసింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

తిరుమల ట్యాక్సీ యూనియన్ స్టిక్కర్ ఆవిష్కరణ

తిరుపతి మంగళం: తిరుమల ఎస్వీ ట్యాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో తిరుమల కర్ణాటక చౌల్ట్రీ ట్యాక్సీ స్టిక్కర్‌ను తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, 2024 తిరుపతి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి ఆవిష్కరించారు. ట్యాక్సీ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా భూమన అభినయ్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద తిరుమల ట్యాక్సీ యూనియన్ స్టిక్కర్‌ను ఆయన ఆవిష్కరించారు.యూనియన్ అధ్యక్షులు సునీల్‌యాదవ్, శరత్‌యాదవ్‌లతోపాటు నాయకులు పాల్గొన్నారు.



ట్యాక్సీ యూనియన్ స్టిక్కర్‌ను ఆవిష్కరిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

లోయలోకి దూసుకెళ్లిన కారు

చంద్రగిరి: భాకరాపేట కనుమ రహదారిలో ఓ కారు అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లిన ఘటన గురువారం రాత్రి 10 గంటలకు సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎర్రావారిపాళెం మండలం ఓఎస్ గొల్లపల్లికి చెందిన నాగభూషణం కుటుంబం తిరుపతికి వెళుతూ భాకరాపేట ఘాట్‌లో కారు అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. కారులోని నాగభూషణంకు తీవ్ర గాయాలయ్యాయి. భార్య స్వరూప, పిల్లలు గురునాథన్, సాత్విక క్షేమంగా బయటపడ్డారు. నాగభూషణంను 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చంద్రగిరి సీఐ రాజశేఖర్ తెలిపారు.

27, 28న ఫొటో ఎక్స్‌పో ప్రదర్శన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: తిరుపతి, తిరుమల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27, 28వ తేదీల్లో రెండు రోజులపాటు తిరుపతిలో ఫొటో ఎక్స్‌పో ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈమేరకు ఫొటో ఎక్స్‌పో పోస్టర్లను గురువారం టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రాజ్, అమరనాథ్, సురేష్, శరత్, రాధాకృష్ణ, రాజు, సునీల్, బాలాజీరావు, పురంధర్, రహమతుల్లా, హరి, హేమంత్, కృష్ణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారులకు అభినందనలు



జాతీయ క్రీడాకారులను అభినందిస్తున్న క్రీడా సంఘాల ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను క్రీడా సంఘాల ప్రతినిధులు గురువారం ఘనంగా సత్కరించి ,అభినందించారు. తిరుపతి జిల్లా ఒలింపిక్ సంఘం, జిల్లా క్రీడా సాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీనివాస క్రీడా సముదాయంలో క్రీడాకారుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎలమంచిలి ప్రవీణ్, కార్యదర్శి ఆర్.శ్రీధర్, జిల్లా క్రీడాధికారి సయ్యద్ సాహెబ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ స్విమ్మింగ్‌లో రాగుల హితేష్, సీనియర్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో పాల్గొన్న కె.శోభలను ఘనంగా సత్కరించారు. స్విమ్మింగ్ శిక్షకుడు ఆది, బాక్సింగ్ శిక్షకులు కైలాష్, విజయమోహన్‌రెడ్డి, ఒలింపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధికి రోల్ మోడల్ తిరుపతి

- టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



21వ డివిజన్‌లో సుందరీకరణ పనులు ప్రారంభించిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తదితరులు

తిరుపతి తుడా: తిరుపతి నగరం దినదినాభివృద్ధి చెందుతోందని, చేపట్టిన అభివృద్ధి పనులు ఇతర నగరాలకు రోల్ మోడల్‌గా నిలిచాయని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. నగరంలో నాలుగు ప్రాంతాల్లో పూర్తి చేసిన అభివృద్ధి పనులు, సుందరీకరణ పనులను టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి గురువారం మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరితలతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ తిరుపతిలో దశాబ్దాలుగా చూడని అభివృద్ధిపై ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదని, ఏదైనా చేసి చూపించాకే ప్రజల వద్దకు వెళ్లగలుగుతున్నామని చెప్పారు. ప్రస్తుత అభివృద్ధి మరింతగా కొనసాగాలంటే ప్రజలంతా జగనన్న ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలన్నారు. గడిచిన రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, అంతకు ముందు చేసిన అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకుని తమకు మద్దతు ఇవ్వాలన్నారు. ఇరుకు రోడ్ల నుంచి విశాలవంతమైన రోడ్లుగా, విస్తరణతో కళకళలాడుతున్న కూడళ్లుగా ఆవిష్కృతమయ్యాయని చెప్పారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ అభివృద్ధికి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి సహకారం, ముఖ్యంగా డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి చొరవతో నగరం సమూలాభివృద్ధి సాధిస్తోందన్నారు. తిరుపతిలో అన్ని సౌకర్యాలు కల్పించేలా తమ కౌన్సిల్ కృషి చేస్తోందన్నారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ నారాయణపురం ప్రారంభం వద్ద రూ.40 లక్షలతో నిర్మించిన ఐలాండ్ సుందరీకరణ పనులను, రూ.33 లక్షలతో రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ కూడలి వద్ద నిర్మించిన సూర్య నమస్కారాల ప్రతిమలు, సుందరీకరణ పనులు తలమానికంగా నిలిచాయన్నారు.

35 ఏళ్ల రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం

తిరుమల బైపాస్ రోడ్డు ఎస్‌బీఐ ఏటీఎం పక్కన శ్రీనిధి రెసిడెన్సీ అపార్టుమెంట్ రోడ్డు సమస్య 35 ఏళ్లుగా స్థానికులను వేధిస్తోంది. చిన్నపాటి వర్షం పడినా చుట్టపక్కల ప్రాంత వాసులు వెళ్లలేనంతగా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కార్పొరేటర్ అనీష్ రాయల్‌తో కలిసి స్థానికులు సమస్యను డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి ఆదేశించారు. రూ.63.45 లక్షలతో సీసీ రోడ్డు, మురికి కాలువలను నిర్మించారు. రూ.40 లక్షలతో శ్రీనగర్ కాలనీ వద్ద నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. కార్పొరేటర్లు తమ్ముడు గణేష్, ఈశ్వరి, సునీత, బోకం అనిల్, ఆరణి సంధ్య, ఆదం రాధాకృష్ణ రెడ్డి, ఎస్‌ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాలగిరి ప్రతాప్‌రెడ్డి, వెంకటమునిరెడ్డి, చంద్ర, అనీల్, పడమటి కుమార్, తిమ్మారెడ్డి, తాళ్లూరి ప్రసాద్, దేవదానం, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



మెటీరియల్‌ను అందజేస్తున్న కార్పొరేటర్ తూకివాకం శాలిని

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి బైరాగిపట్టెడలోని ఎంజీఎం నగరపాలక ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను గురువారం స్థానిక కార్పొరేటర్ తూకివాకం షాలిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్న సుదుద్దేశంతో ఎన్ఆర్ఐ కొండా చంద్రమోహన్, అతని మిత్ర బృందం రూ.35 వేలు విలువైన స్టడీ మెటీరియల్‌ను సమకూర్చినట్లు తెలిపారు. పాఠశాల హెచ్ఎం మురుగన్, వైఎస్సార్ సీపీ నాయకుడు తూకివాకం మహేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు బండి మధుసూదన్‌రెడ్డి, వై.హేమాద్రి బాబు, ఎం.మునిశారద, కె.రవికుమార్ పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య శ్రీరాముని అక్షింతలు



ఇంటింటికీ అయోధ్య అక్షింతల పంపిణీ

తిరుపతి కల్చరల్: అయోధ్యలో భవ్యమైన రామమందిర ప్రాణప్రతిష్ట సందర్భంగా విశ్వహిందూ పరిషత్ నగర కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో గురువారం నెహ్రూ నగర్‌లో ఇంటింటికీ శ్రీరామ పూజిత అక్షింతలు పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరామ మందిర ప్రాణ ప్రతిష్ట నేపథ్యంలో విశ్వవ్యాప్తంగా ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు శ్రీరామ పూజిత అక్షింతల వితరణ కార్యక్రమం చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఇంటింటికీ శ్రీరామ పూజిత అక్షింతలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు కీర్తి వెంకయ్య, ఘనపూర్ సింగ్, ధనుంజయ, పనుగంటి భాస్కర్, గుండాల గోపినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి భక్తుడు శక్తిదాసన్ సైకిల్ యాత్ర



సైకిల్‌పై కోయంబత్తూరుకు తిరుగు ప్రయాణమైన శక్తిదాసన్

చంద్రగిరి: తిరుమల శ్రీవారి భక్తుడు శక్తిదాసన్ తన సైకిల్ యాత్ర మరోమారు పూర్తి చేసుకుని గురువారం తిరుగు ప్రయాణమయ్యారు. తమిళనాడు, కోయంబత్తూరు జిల్లా కినత్తుకడవు, సంగరామ్ పాళ్యంకు చెందిన శక్తిదాసన్(62) తిరుమల శ్రీవారి దర్శనార్థం సైకిల్‌పై వచ్చారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ఏటా సైకిల్‌పై దాదాపు నాలుగు వందల కిలోమీటర్లకు పైగా ప్రయాణించి స్వామి వారిని దర్శించుకుని తిరిగి వెళుతున్నట్లు తెలిపారు. ఆరు పదుల వయసులోనూ పెరుమాళ్‌పై తనకున్న భక్తి ప్రయాణ కష్టాన్ని దూరం చేస్తున్నట్లు తెలిపారు.

దివ్యాంగులకు ప్రభుత్వం తోడ్పాటు అందించాలి



అన్నదానం చేస్తున్న దివ్యాంగులు

చంద్రగిరి: దివ్యాంగుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందించాలని మునీశ్వరస్వామి దివ్యాంగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ కోరారు. లూయి బ్రెయిలీ జయంతి సందర్భంగా గురువారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద దివ్యాంగులు కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. జిల్లా అధ్యక్షురాలు ఉషారాణి, సెక్రటరీ పూజ పాల్గొన్నారు.

చీని, నిమ్మపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు

చంద్రగిరి: గంగుడుపల్లి గ్రామంలో గురువారం అనంతరాజు పేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, విద్యార్థులు రైతులకు చీని, నిమ్మ, మామిడి ఇతర ఉద్యాన పంటలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్యాన శాస్త్రవేత్తలు డాక్టర్ ముకుంద లక్ష్మి, శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మామిడిలో మూడు సార్లు పిచికారి చేయాల్సిన మందుల వివరాలను, వాటిని ఎలా పిచికారి చేయాలనే అంశంపై అవగాహన చేపట్టారు. చీనిలో ఆర్కసిట్రస్ వినియోగంపై అవగాహన చేపట్టారు. భూసార పరీక్షలు చేసిన తర్వాత వాటికి అనుగుణంగా పంటలను వేసుకోవాలని సూచించారు. సర్పంచ్ ధర్మారెడ్డి, శైలజ ఇతర అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డయాలసిస్ బాధితులకు మందులు విరాళం



మందులు అందుకుంటున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి తుడా: స్విమ్స్ నెఫ్రోప్లస్‌లో చికిత్స పొందుతున్న డయాలసిస్ బాధితులకు డాలర్స్ గ్రూప్ అధినేత దివాకర్‌రెడ్డి విలువైన మందులను అందజేశారు. డయాలసిస్ రోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటరామయ్య ద్వారా గురువారం స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీకుమార్‌కు మందులు అందజేశారు. డాక్టర్లు రామ్, నాగరాజు, కె.భూపాల్ పాల్గొన్నారు.